# లాటరీ

ఆస్ట్రేలియన్ కథ : మార్జొరి బార్నార్డ్
అనువాదం : సి.ఎల్.ఎల్. జయప్రద

టెడ్ బిల్‌బరో పడవ లోపలికి నాలుగడుగులు వేశాడో లేదో ఫ్రెడ్‌యీయా ఎదురు వచ్చి 'అదృష్టమంటే మీ ఆవిడదే'నంటూ షేక్ హాండ్ ఇచ్చాడు. కొంత హాస్యం కొంత వెటకారం ఉన్న అతని మాటల్లో అర్థమేమిటో టెడ్‌కి ఒక పట్టాన బోధపడలేదు. అతని చేతిలో మడత పెట్టిన న్యూస్ పేపరుంది. మిగిలినందరూ కూడా ఆసక్తిగా తన ముఖంలోకే చూస్తున్నారు. వాళ్ళందరూ కలసి తనను ఆట పట్టించటం లేదు కదా! వస్తున్న చికాకుని అణచుకుని పైకి గంభీరంగా 'చిల్లరుంచుకోవయ్యా!' అన్నాడు పడవవాడితో.

'టెడ్ కింకా విషయం తెలిసినట్లేదు'

'మీ ఆవిడకి లాటరీ తగిలిందయ్యా'

'అంత సులభంగా మనమాట నమ్మ్తాడా! పేపరు చూపించండి. ఇదిగో నాతలకాయంత అక్షరాలతో రెండో పేజీలో పడింది. శ్రీమతి గ్రేస్ బిల్‌బరో, 52 కత్‌బర్డ్ వీధి అని. 'ఆఖరి ఆశా కిరణం' అనే పేరుతో కొన్నట్లుంది ఆమె. అయిదువేల పౌండ్లు.' అన్నాడు ఇంకో స్నేహితుడు.

'అతన్ని కొంచెం ఊపిరి పీల్చుకోనివ్వండి' అన్నాడు ఫ్రెడ్.

చాలామంది దగ్గరకు వచ్చి అతని భుజం మీద తట్టారు. గత పదేళ్ళనుండి రోజూ ఆఫీసుకు ఆపడవలోనే ప్రయాణం. అందులో కొంతమంది స్నేహితులు, పరిచయస్థులు, మరికొంతమంది మొహం మాత్రమే తెలిసినవాళ్ళు. అందరూ వచ్చి అతని చుట్టూ గుమిగూడారు. అతనికి పొగాకుతో పైపు నెమ్మదిగా నింపుతుంటే చేతుల్లో నుండి చిన్న వణుకు లాంటిది బయలుదేరి గుండెలకు పాకినట్టనిపించింది. ఇంకా తన ఆఫీసులో ఈ విషయం ఎవరికీ తెలిసినట్టులేదు. గ్రేస్ ఎప్పుడూ ఇంతే! వీధి చివర థామ్సన్స్ కొట్లో నుండి ఫోన్ చేసి తనకు విషయం చెప్పచ్చు కదా! పైగా వాళ్ళు ఆడపదడపా నిచ్చెన కోసమో, లాన్ మోవర్ కోసమో తమ దగ్గరకి అరువుకి వస్తూనే వుంటారు.

'మాకు రాకపోతే పోయింది. నీకైనా అదృష్టం పట్టింది సంతోషం' అన్నారు వాళ్ళందరూ.

అందులో కొంత నిజం లేకపోలేదు. అతడు మనిషి మంచివాడు. కాస్త కూస్త వాళ్ళతో సరదాగా కాలం గడుపుతాడు. భార్యాబిడ్డల పట్ల బాధ్యత గలవాడు. పిల్లలను భార్యతో సమానంగా దగ్గరికి తీసుకుని లాలిస్తాడు. భార్యాభర్తలిద్దరూ ఎక్కడా అప్పు చెయ్యకుండా జాగ్రత్తగా సంసారం లాక్కొస్తున్నారు. కొద్దిగా వెనక కూడా వేశారేమో! అదీ కరువు రోజుల్లో విశేషమే! ఎందుకంటే డిప్రెషన్ మూలంగా అందరకీ జీతాలలో పదిశాతం గవర్నమెంటే కోసేసింది. అతడు ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఉంటాడు. అందరినీ పలకరిస్తాడు. ఇవన్నీ అతని మనసులో ఇప్పుడు మెదలుతున్నాయి. ఎక్కడో అంతరాంతరాల్లో తన మంచితనానికి మర్యాదకి ఎప్పుడో కాలం కలసి రాకపోతుందా అనుకునేవాడు. అయితే ఆ కలసి రావటం ఇలా గ్రేస్ ద్వారా జరుగుతుందని మాత్రం అతను ఎన్నడూ ఊహించలేదు.

'ఆ డబ్బంతా ఏం చేస్తావ్ టెడ్' అడిగారెవరో వెనుకనుండి

'ఇంక ఒక వారం కనపడడులేమనకి. బారుల్లో కూర్చుని జల్సా చేస్తాడు' టెడ్‌కి ఆ మాట వింతగా అన్పించింది. తన కెప్పుడూ అలాంటి అలవాటు లేదు. అందరూ ఒళ్ళు మరచి ఉషారు చేసుకునే 'యాన్‌జాక్'డే రోజు కూడా తను ఒక్క చుక్క ఎన్నడూ ఎక్కువ పుచ్చుకోలేదు.

ఇంకెవరో గొణుగుతున్నట్లు అన్నారు. 'హోప్ సిన్‌డికేట్ లాటరీ మొదలు పెట్టిన దగ్గరనుండి ప్రతివారం నేను టికెట్ కొంటూనే ఉన్నాను. ఇంతవరకూ నాకు ఒక్క సెంటు కూడా లాటరీలో రాలేదు.' మిగిలిన వాళ్ళెవరూ అతనిమాట విన్పించుకోలేదు.

'చక్కగా ఆ డబ్బుచ్చుకుని దేశమంతా తిరిగి రండయ్యా'

'టెడ్ నిన్ను ఏకంగా టెన్నిస్ క్లబ్‌కి ప్రెసిడెంట్‌ని చేసేస్తారు ఒక వెండి కప్పు ప్రైజు కింద ఇచ్చేసావంటే'

ఆ బెణుకులూ, విసుర్ల క్రింద అతన్ని ఆకాశాని కెత్తే ప్రయత్నం ఉంది.


'బహుశ మా శ్రీమతి పిల్లల పేరున ఏ బాంకులోనైనా కొంత వేస్తుందేమో!' అన్నాడు. న్యూస్ పేపరుకి ఇంటర్వ్యూలో చక్కటి సమాధానం చెప్పినంత తృప్తిగా ఉంది అతనికి. పరాయివాళ్ళతో అతనెప్పుడు గ్రేస్ గురించి చెప్పినా మర్యాదగా మా శ్రీమతి అంటుంటాడు. ఎందుకో 'మా ఆవిడ, మా ఆడవాళ్ళు' లాంటి మాటలు అతనికి నచ్చవు.

టెడ్ వాళ్ళ మాటలు వింటూ కిటికీలో నుండి నీళ్ళవైపు దృష్టి సారించాడు. పడవ ముందుకు దూసుకు వెళుతుంటే వెనకకు ఉరకలు వేసే నీరు ఫర్నేస్‌లో ఉడుకుతున్న గ్లాస్ లాగా ఉంది. సంధ్య చీకట్లు చిక్కబడుతున్నాయి. మందంగా ఉన్న శీతాకాలం గాలిలోనుండి సూర్యుడు బంగారు పళ్ళెంలా అప్పుడే పొగలోనుండి పైకి వస్తున్న చంద్రుడిలా కన్పిస్తున్నాడు. నెమ్మదిగా పారుతున్న నది, బోటు వెనకకు పరుగులు తీస్తున్న నీటిపై లేత కాషాయరంగు కాంతి పరచుకుంది. గట్టుమీద అప్పుడే చీకట్లు ముసురుతున్నాయి. ఎత్తుగా ఉన్న రెండు చర్చి కట్టడాలు వాటి ప్రక్కలనుండి దడిలా కట్టినట్లున్న పైన్ చెట్లూ మసక మసకగా ఆకాశం కాన్వాసుపై బూడిద రంగులో వేషిన బొమ్మల్లా కన్పిస్తున్నాయి. రెండో ఒడ్డున విసిరేసినట్లున్న ఇళ్ళు అక్కడక్కడా ఉన్న చెట్లు అస్పష్టంగా కన్పిస్తున్నాయి. అలముకునే చీకట్లలో నదిలో నీళ్ళు మాత్రం ఇంకా మిణుకు మిణుకంటూ మెరుస్తున్నాయి. నీళ్ళపై అల్లల్లాడుతున్న వెలుగు చీకట్లు రెండు రకాల ప్రపంచాలను అతనికి చూపిస్తున్నాయా అన్నట్లున్నాయి ఒకవైపు గట్టుమీద చర్చిలు రెండూ చీకట్లలో కలసిపోతుంటే రెండో వైపు గట్టు పైన ఇళ్ళు కొద్ది వాటి వెలుగులో స్నానమాడుతున్నట్లున్నాయి.

'అయిదువేల పౌండ్లు' మళ్ళీ ఒక సారి మనసులో అనుకున్నాడు. కనీసం దాని పైన నెలకు అయిదు శాతం వడ్డీ వచ్చినా అది అలాగే పెరిగి తామిద్దరం ముసలి తనంలో చీకు చింతా లేకుండా గడపటానికి సరిపోతుంది. అయిదువేలతో ఎన్నో పనులు చేసుకోవచ్చు. కొత్తగా శక్తి పుంజుకున్నట్టు అన్పించింది. ఇంకో వైపు అంత డబ్బు

గ్రేస్ సొంతం అంటే నమ్మశక్యం కాకుండా ఉంది. టికెట్ కొనటానికి అంత డబ్బు ఎక్కడనుండి వచ్చిందో ఆమెకి. అంతకి అంత సరిపోయే తమలాంటి సంసారంలో అయిదు పౌండ్లు మిగలటం సాధ్యం కాదు. ఏ కొంచెం మిగిలినా తను బాంక్ లోనే వేస్తుంటాడు. ఒకవేళ గ్రేస్ ఇంటి లెక్కల్లో తప్పుడు లెక్కలు చెప్పటం లేదుకదా! తమ మధ్య సామాన్యంగా అరమరకలు లేవు. ప్రతి విషయం ఇద్దరూ ఆలోచించే చేసుకుంటారు. తనకి తెలియని రహస్యాలు గ్రేస్ కేమయినా ఉన్నాయా? తమలాంటి సామాన్య జీవితాలలో దాచుకోవటానికి ఏం ఉంటాయి. అలా అనుకోగానే మనసు కొంచెం కుదుట పడింది.

తన భార్యనే అదృష్టం వరించింది. ఆమె మంచి భార్యనే చెప్పాలి. ఒక సారి ఆమె సుస్మితంగా డార్లింగ్ చేసిన తన షర్టువైపు చూసుకున్నాడు. పిల్లల్ని, ఇంటినీ శుభ్రంగా ఉంచుతుంది. ఇప్పుడు తనింటికి వెళ్ళేసరికి టెన్నిస్‌కి వెళ్ళటానికి తెల్లపాంటు శుభ్రంగా ఉతికి రెడీగా ఉంచుతుంది. తనుకూడా మంచివాడే! జీతమంతా తన ఖర్చులకి పోను ఆమె చేతిలోనే పోస్తాడు. ఇంకో స్త్రీ వైపు కన్నెత్తి చూసి ఎరుగడు. బయటవాళ్ళకు తమ ఇల్లు స్వర్గం లాగే కన్పిస్తుంది. తనకెందుకో



తమ ఇంట్లో కంటే ఎవరైనా స్నేహితులింటికి వెళ్ళినపుడే సరదాగా కాలక్షేపం అవుతుంది. దానికి కారణం బహుశ గ్రేసేనేమో!ఎందుకో ఆమె నవ్వుతూ తుళ్ళుతూ సరదాగా ఉండదు. ఎప్పుడూ ముభావంగా ఇంట్లో పనులు చక్క బెట్టుకుంటూ ఉంటుంది. అసలు తను చూసినన్ని కష్టాలు ఆమె ఎక్కడ చూసింది? ఆమె చేసేదల్లా ఇంట్లో ఉండి ఇల్లు పిల్లల్ని చక్కబెట్టుకోవటం. అందులో ఏముంది? ఆమె ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉంటుంది. అయినా అంతసేపు చేసేందుకేముంటుంది చాదస్తం తప్ప. అయినా గ్రేస్‌కి వయస్సేమీ పెద్ద మీద పడలేదు. పెళ్ళయి పట్టుమని పదేళ్ళు. ఇద్దరు పిల్లలు. ఆమెలో ఇంకా తొలి యవ్వనపు ఛాయలతో పాటు వయస్సులో ఉన్న పిల్లల్లో ఉండే మంకుతనం కూడా ఉంది. ఏమైనా ఆమెను ఆమెతోనే పోల్చాలి. ఇకముందు ఆమె కాస్త సరదాగా ఉంటుందేమో! ఇలా అయిదు పౌండ్లు ఖర్చుపెట్టి ఆమె లాటరీ టికెట్లు కొందంటే తను అవసరమైన దానికంటే ఇంటి ఖర్చుకి ఎక్కువ డబ్బే ఇస్తున్నట్లు లెక్క. పైగా దానికి 'లాస్ట్ హోప్' అని పేరిచ్చింది. 'ఆఖరి ఆశ' అంటే అంతకుముందు కూడా టిక్కెట్లు కొంటున్నట్టే అనుకోవాలి. లేకపోతే అలాటి పేరయితే కలిసి రావచ్చుని ఆ పేరిచ్చిందా?

పడవలో ఎదుటి బల్లమీద కూర్చున్న అమ్మాయి కనీ కనబడని వెలుతురులో సిల్కు దుస్తులపైన లేస్ కుడుతుంది. పెళ్ళి బట్టలు కాబోలు అనుకున్నాడు.

'నువ్వేమనుకుంటున్నావ్?' ప్రక్కనే కూర్చున్న మనిషి ఏదో అడిగాడు. టెడ్ అతని మాట విన్పించుకోలేదు.

పడవ వాళ్ళ ఊర్లో ఆగింది. టెడ్ దిగి ఇంటిదారి పట్టాడు. ఏమీ జరగనట్టు నడవటానికి ప్రయత్నం చేశాడు. ఎందుకో నీరసంగా అన్పించింది. నెమ్మదిగా తన ఇరుగు పొరుగు వాళ్ళతో కలసి కొండపైకి నడక మొదలు పెట్టాడు. వాళ్ళింకా లాటరీ డబ్బుల గురించి అతన్ని ఆట పట్టిస్తూనే ఉన్నారు. సూర్యుడు కుంగుతుంటే దూరంగా ఉన్న నది ఒడ్డున మేఘాలు జరీ అంచు బురఖా కప్పుకున్నట్లున్నాయి. వాళ్ళందరూ దారులు చీలి ఎవరింటి దారి వాళ్ళు పట్టారు. టెడ్ అతని వీధిలోనే ఉండే ఇంకో అతను ముందుకు వెళుతున్నారు బలవంతాన నవ్వు ముఖం పెట్టడం మూలాన కాబోలు టెడ్ బుగ్గలు దవడలూ నొప్పిగా ఉన్నాయి.

'నీకు లాటరీ తగిలినందుకు నాకు చాలా సంతోషంగా ఉందోయ్' అన్నాడతను

'నీకలాంటి మనస్సుంది'

'అందరి కంటే నీకు రావటం నాకు ఆనందంగా ఉంది.'

'నేను ఆశించకుండా వచ్చిన అదృష్టం అది'

'అలాంటి అదృష్టం ఏ పాటిది తగిలినా మేము కూడా గట్టున పడేవాళ్ళం'

'నిజమే'

'ఇంటిమీద వాయిదా కట్టాలి. నెల్లీ ఇంటికి వస్తుంది. నెల తప్పిందిగా! ఇంకా పెళ్ళికి చేసిన అప్పు తీరనేలేదు.'

'ఒక దానిమీద ఒకటి'

'మళ్ళీ పురిటి ఖర్చులూ ... తల్లిదండ్రులకూ తప్పవుగా'

'నిన్న మొన్నటిదాకా నెల్లీ సైకిలుపై రెండు పిలకలేసుకుని అటూ ఇటూ తిరుగుతూనే ఉంది.'

'పిల్లలెంతలో ఎదుగుతారు? ' ఎరిక్ నెమ్మదిగా అన్నాడు. 'అసలు సమస్య ఇంటి మీద వాయిదా. ఒకటో తారీకు కల్లా ఠంచనుగా కట్టేయాలి. అదే లేకపోతే నెల్లీ వస్తున్నందుకు సంతోషంగానే ఉండేది. ఆడపిల్ల ఉన్నన్నాళ్ళు పుట్టింట్లో ఉండదు కదా!'

'బహుశ తాతనవుతున్నందుకు నువ్వు చాలా గర్వపడేవాడివి అవునా!'

'నిజమే'

వాళ్ళిద్దరూ మౌనంగా ఎరిక్ ఇంటి గేటు దగ్గర కాసేపు నించున్నారు. ఇంతలో టెడ్ మనసులోకి ఒక ఆలోచన వచ్చింది. సంతోషం మనసు నిండా పరచుకున్న భావన. చాలా గొప్ప వాడినై పోయాననిపించింది.

'నేను నిన్ను ఇబ్బందుల పాలవనివ్వనులే' అన్నాడు.

'అంత మాటన్నావు. అదే చాలు'

'నిజంగానే అంటున్నాను'

ఇద్దరూ షేక్‌హేండ్ ఇచ్చుకుని చెరొక దారి పట్టారు. ఇంకో నాలుగడుగుల్లోనే తమ ఇల్లు. నెమ్మదిగా అడుగు లేస్తున్నాడు. ఎంత పొడిగా వేడిగా ఉంది వాతావరణం. తోటకి నీళ్ళు పెట్టాలి. కనబడలేదు. ఒక క్షణం పదేళ్ళ నుండి ఉంటున్న ఇల్లు మొదటిసారి చూసినట్లు కొత్త కళ్ళతో చూస్తూ నిలబడ్డాడు. ఏదో రంగులు వెలసిన చిన్న పెంకుటిల్లు. ఇంటిపై కప్పంతా లేచిపోయి, చెక్కంతా రంగువెలసి చూడటానికి అసహ్యంగా ఉంది. ఒకప్పుడు తను శ్రమపడి దారిలో పరచిన బండలు ఎగుడు దిగుడుగా ఉన్నాయి. ఒక క్షణం మెరుపులాంటి ఆలోచన వచ్చింది. కావాలంటే తాము ఆ ఇల్లు వదిలేసి వేరే ఇంట్లోకి వెళ్ళిపోవచ్చు. ఊహలకి రెక్కలొచ్చిన ఆ క్షణంలో ఆ ఇల్లు దరిద్రంగా కన్పించిందతనికి.

ఎందుకో వెంటనే లోపలికి వెళ్ళాలనిపించలేదు. తమ సంసారంలో ఈ మధ్య విశేషమైన సంఘటన లేమీ జరుగలేదు. ఆమె ఈ వార్తనెల తీసుకుందో. కాళ్ళూ చేతులాడక ఈ రాత్రికి వంట మానెయ్యలేదు కదా!

హాల్లోకి వెళ్ళి తల మీద టోపీ తీసి వంకికి తగిలించి గట్టిగా పిలిచాడు. 'ఏదీ నా గృహలక్ష్మి, భాగ్యలక్ష్మి' అంటూ

గ్రేస్ వంటింట్లో భోజనాల హడావిడిలో ఉన్నట్లుంది.

'మీరు ఆలస్యంగా వచ్చారు. భోజనం చల్లారిపోతుంది' అంది మామూలుగా.

పిల్లలు భోజనాలు ముగించి ఆటలకి పరిగెత్తే హడావిడిలో ఉన్నారు.

'పేపర్ల వాళ్ళెవరో వచ్చారు. ఏదో చెప్పి వాళ్ళని వదిలించుకున్నాను' అంది అదేదో అతి మామూలు విషయంలా. ఇలాంటి చిన్న చిన్న చికాకుల నుండి బయట పడటం ఆమెకి బాగా తెలుసు. అతని మనసుకి కష్టం అన్పించి దేమిటంటే అతనితో కూడ ఆమె తన ఆనందాన్ని పంచుకోనేట్లు లేదు. ఇది స్వాభావికమైన నిర్లిప్తతా లేక ఆమె ఇక తనని లెక్కచెయ్యదా? ఆమె వంక చురుగ్గా చూస్తూ, 'ఆ డబ్బు ఆమెకి ఎక్కడనుండి వచ్చింది' అనుకున్నాడు మళ్ళీ.

కాసేపట్లో పిల్లలు బయటకి వెళ్ళిపోతే వాళ్ళిద్దరే మిగిలారు. ఆమె టేబుల్ పైన గిన్నెలు అవీ సర్దటం మొదలుపెట్టింది. ఆమెని దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేస్తూ 'గ్రేస్ నీకు సంతోషంగా లేదా?' అని అడిగాడు.

ఆమె అతని కళ్ళలోకి చూసింది. ఆమె ముఖంలో బాధ, కోపం లాంటి భావాలేవో తారట్లాడి మాయమయ్యాయి. దూరంగా జరిగి 'సంతోషమే' అంది కంచాలు గ్లాసులు చేతిలోకి తీసుకుని వంటింటి వైపు అడుగులు వేస్తూ. ఆమె వెంట అతనూ లోపలికి వెళ్ళాడు.

'నువ్వు చాలా లోతు మనిషివి. నాతో ఒక్కమాట కూడా అనలేదు.'

'ఈమెలో ఇంత దాపరికం ఉందని నాకు ఇన్నాళ్ళూ తెలియలేదు' అనుకున్నాడు మనసులో వంటగదిలో తడబడుతూనే గబగబా పనులు చక్కబెడుతుంది. అతని మనసులో ప్రశ్న గ్రహించినట్లుంది.

'మా అమ్మ చనిపోయే ముందు నాకిచ్చిన బంగారు ఉంగరం, గొలుసు అమ్మేశాను. ఒకసారి ఇళ్ళ వెంట తిరిగి పాత బంగారం కొనే అతను వస్తే ఆ బంగారం అమ్మి ఆ డబ్బు మొత్తం అయిపోయే వరకు ప్రతి వారం ఒక టికెట్ కొన్నాను' అంది.

'ఓహో' అన్నాడు పైకి. 'తల్లి పెళ్ళి నాటి ఉంగరం అమ్మేసి లాటరీ టికెట్లు కొందా' అనుకున్నాడు నమ్మలేనట్లు.

' ఆ డబ్బు నాకే చెందుతుంది' అంది ఆమె.

'కాదని నేననటం లేదు'

'అవును అనటం లేదు' అంది మళ్ళీ

ఆమె చతిలో కంచాలు గడగడా శబ్దం చేస్తూ ఆమె పైకి చెప్పక అదిమి పెడ్తున్న భావాలకి సంకేతాల్లా ఉన్నాయి . టెడ్‌కి ఒక క్షణం ఆమె మనసులో ఏముందో తెలిస్తే బావుణ్ణనిపించింది.

'ఆమె ముందు గదిలోకి వచ్చి టేబుల్ దగ్గర అతని ఎదురుగా నిటారుగా నించుంది. 'బహుశ నేను ఆ డబ్బుతో ఏం చేస్తానా అని మీరు అనుకుంటున్నారేమో! నేను వెళ్ళిపోతున్నాను. ఈ ఇంటికి ఈ మనుషులకి దూరంగా! విషయం నా చేతులు దాటి పోకముందే రేపే......'


ఆమె ఏం మాట్లాడుతుందో అర్థం కానట్లు చూశాడు అతను.

'బెట్టీ వచ్చి పిల్లల్ని ఇంటిని చూసుకుంటుంది. మీకు ఒక్క పైసా కూడా ఎక్కువ ఖర్చు కాకుండా అన్నీ చేస్తుంది' అంది అతని ఇబ్బంది అర్థమైనట్లు.

ఒక్కసారి ఒంట్లోకి నీరసం వచ్చేసినట్లువేలాడబడిపోతూ అడిగాడు దీనంగా.

'అయితే పేపర్లో నువ్వు చెప్పిన మాట 'ఆఖరి ఆశ'కు అర్థం ఇదేనా!'

'అవును' అందామె ఏ భావం లేకుండా ●



# దారి తప్పిన కథ

కామాంధుల విషపుకోరలకు బలియైన శ్వేతలాంటి అభాగినులతో పాటు, స్త్రీ అయి పుట్టిన పాపానికి బాల్యదశలోనే బలవంతంగా లైంగిక వ్యాపార రొంపిలోనికి లాగబడ్డ అనేక బాధాతప్త హృదయాలను ఆవిష్కరించటంద్వారా సమాజాన్ని ప్రశ్నించే ప్రయత్నంచేశారు ఓల్గా, ఈ ప్రయత్నానికి కథారూపాన్ని సాధనంగా ఎన్నుకున్నారు. అలాంటప్పుడు కథకు మౌలికలక్షణమయిన 'శిల్పాన్ని' (చలం దృష్టిలో కళాత్మకత) లోపింపచేయుటం 'ఓల్గా' గారు సాధారణంగా చెయ్యని నేరంగా భావిస్తున్నాం. శిల్ప కథకి ఆయువుపట్టు కథలో శిల్పం లేకపోయాక ఇంకెన్నున్నా దండగేనన్న విషయం ఓల్గాగారికి తెలియందికాదు.

అలాగే కథల్లోని భాష యిలామాత్రమే వుండాలని ఎవరూ ఎవరినీ నిర్దేశించలేరు. వస్తువుపట్ల అవగాహనకు ఆటంకం కాకూడదని మాత్రం ఆశిస్తాం. అయితే 'అయోని' కథలో 'ఓల్గా' గారి భాషావైపరీత్యంవల్లా, వర్ణనలలో పనికట్టుకుని వాడిన జుగుప్సాకరమయిన పదాలవల్లా పాత్రలతో మమైక్యం చెందవలసిన పాఠకులు జుగుప్సతోటి, అసహ్యంతోటి హృదయాలను నింపుకుంటారు. రచయిత్రి ఆశయానికి ఆవిడభాష ప్రతిబంధకమయ్యింది. భాషాసాంప్రదాయాలను ఛేదించాలన్న 'ఓల్గా' గారి తపన భాషావైపరీత్యానికి కారణం అనుకుంటే, ఒక్కసారి దిగంబరకవితా వైఫల్యాన్ని గుర్తుచేసుకోవటం మంచిది.

అంగాంగవర్ణనల దుష్టసాంప్రదాయాన్ని సిన్సియర్‌గా ఖండిస్తూ వస్తున్నది ఈనాటి యువత. అలాంటి సమయంలో 'ఓల్గా' గారు భాషావిషయకమయిన మరో దుష్టసాంప్రదాయాన్ని నెలకొల్పటం భావ్యంకాదు.

నాకుమాత్రం వెంటనే అయోనిగా మారాలనివుంది. నా కోరిక అసహ్యంగా వుందనీ మంచిదికాదనీ మీరు అనుకుంటే ముందు ఈ హింసను ఆపండి. చిన్నిచిన్ని పాపలను వాళ్ళయోనులకోసం ఎత్తుకొచ్చే నాగుబాముల్ని పొడిచి పొడిచి చంపండి. ఈ వ్యాపారాన్ని ఆపండి. అదీచేతకాకపోతే నన్నుచూసి అసహ్యించుకుంటారు మీరు. నా కథ చీదరగా వుందంటారు. అని కథలోనిపాత్రచేత ఓల్గాగారే అనిపిస్తారు. శిల్పలోపంతోపాటు అసహ్యకరవర్ణనలూ, పదాల వల్లే ఈ కథ చీదరగా తయారయిందన్న విషయం ఓల్గాగారి ఆంతర్యమే చెబుతూంది. మరి పాఠకుడు అలా అనుకోకూడదు. పాఠకుడుమాత్రం ఈకథ చీదరగావుంది అని అనుకున్నట్లయితే అది అతని చేతకానితనమే అవుతుందట. ఓల్గాగారు తన చీదరకథను సమర్థించుకోవటంకోసం ఈ టెక్నిక్ ఉపయోగించినట్లు అనిపిస్తుంది.

సాధారణంగా భాషా, కళాత్మక అంశాలను ఏమాత్రం లోపం చెయ్యని స్వేచ్ఛ, ప్రయోగం వంటి ఉత్తేజకర రచనలను అందించిన ఓల్గాగారి కలంనుంచి 'అయోని' లాంటి చీదరకథలు వెలువడటం విచారకరం. తన 'ప్రయోగం' సరియైనదేనన్న నమ్మకం ఓల్గాగారికి వుండివున్నట్లయితే "ఈ కథ ఎక్కడా అచ్చవదు" అంటూ కథను ముగించేవారుకాదు.

-స్వర్ణ మల్లికార్జున ప్రసాద్,
చీరాల.